సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



దయచేసి వినండి.. రైళ్లలో నీళ్లు లేవు!

తిరుపతి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం బయలుదేరింది. ఇంతలో నీళ్లు అయిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డాల్సి వచ్చింది. -8లో



బిడ్డకు జన్మనిచ్చి.. తనువు చాలించి..

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లి తనువు చాలించిన ఘటన శనివారం జమ్మలమడుగు పట్టణంలో చోటు చేసుకుంది. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.8/20.4

జిల్లాలో శనివారం 20.4 - 29.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఇసుక రీచ్‌ల తనిఖీ



ఇసుక రీచ్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కడప కోటిరెడ్డిసర్కిల్: పెండ్లిమర్రి మండలంలోని పాపాగ్ని పరివాహక ప్రాంతంలోని నంది మండలం, కొత్తగంగిరెడ్డిపల్లె ఇసుక రీచ్‌లను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి శనివారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆయా రీచ్‌లలో ఇసుక బుకింగ్ నమోదు ఎలా చేస్తున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీచ్ నిర్వహణ కార్యకలాపాలపై రీచ్ నిర్వాహకులు మహిళా పోలీసులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఆలయాల భూములను ఆక్రమిస్తే చర్యలు

రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలోని ఆలయ భూములను ఆక్రమించినట్లు తేలితే చర్యలు తప్పవని జిల్లా దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సీవిశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం రైల్వే కోమండలంలోని చియ్యవరం పంచాయితీ, కేఆర్ కండ్రికలో జరిగిన రెవిన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేవదాయశాఖకు సంబంధించిన భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఆలయాల భూములు అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నాగభూషణం, తహశీల్దార్ మహబూబ్‌చాంద్, సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల యూత్ ఎక్ఛేంజ్ ప్రోగ్రాంకు ఎంపిక



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: విశాఖపట్టణంలో జనవరి 2 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించనున్న అంతర్ జిల్లాల యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంకు వైవీయూ పరిధిలోని అనుబంధ కళాశాలల నుంచి యువత ఎంపికయ్యారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ క్యాంపులో పాల్గొనే 14 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్ల జాబితాను వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రకటించారు.

ఎంపికైన వలంటీర్లు: ఎన్. గంగిరెడ్డి, ఎస్.ఎం.వలిద్, ఎస్.పవన్‌కుమార్, కె.మహేష కె.వెంకటేష్, ఇ.శివశంకర్, సి.పావని, కె.జాహ్నవి, సి.తేజ, జి.మహిత, వి.నందిని, కె.గంగామోక్షిత, ఎం.కవిత, బి.శంకర్‌నారాయణ.

- ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన సి.పావని, కె.జాహ్నవి ఈ క్యాంపునకు ఎంపికవడంపై ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా అభినందించారు.

పేదోడి రైళ్లకు సెలవు!

- పల్లె రైళ్లకు 'కుంభమేళా'బ్రేక్‌లు
- పెదవి విరిస్తున్న పేద ప్రయాణికులు
- రెండు నెలలపాటు ప్రయాణానికి గ్రహణం
- ప్రత్యామ్నాయం చూపని రైల్వేబోర్డు
- నోరు మెదపలేని స్థితిలో కూటమి ఎంపీలు



తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్

రాజంపేట: తిరుపతి-గుంతకల్ మధ్య ఉన్న రెండు వేర్వేరు మార్గాల్లో పేదోడి రైళ్లకు బ్రేక్ వేశారు. ఏకంగా రెండునెలలపాటు పల్లె రైళ్లకు రాబోయే కుంభమేళా-2025 నేపథ్యంలో సెలవు ఇచ్చేశారు. పేదవాడి కోసం ఉన్నదే ఒకరైలు, దానిని కూడా రద్దు చేశారు.దీంతో పేద ప్రయాణిక వర్గాల్లో రైల్వేబోర్డు నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెలువడుతున్నాయి. దేశంలో ఎక్కడా రైళ్లు లేన్నట్లుగా సీమలో ప్రతి గ్రామీణ రైల్వేస్టేషన్‌లో ఆగుతూ, పరుగులు తీసే పల్లెరైళ్లను కుంభమేళా-2025కు దారిమళ్లించడం ఇప్పుడు సీమలో వివాదాస్పదంగా మారుతోంది. దీంతో తిరుపతి-గుంతకల్ మధ్య వేర్వేరు రెండు రైలుమార్గాల్లో నడిచే పల్లె రైలును రద్దు చేస్తూ దక్షిణమధ్య రైల్వే డిప్యూటీ సీవోఎం కె.మనికుమార్ పేరిట ఉత్తర్వులు జారీ అయిన సంగతి తెలిసిందే. అడిగే నాథుడు లేన్నట్లుగా రైల్వే ఉన్నతాధికారులు గుంతకల్ డివిజన్ పరిధిలో తీసుకుంటున్న నిర్ణయాలు పరోక్షంగా కేంద్రప్రభుత్వంపై పేదవర్గాల్లో అసంతృప్తిని పెంపొందిస్తోంది.

తిరుపతి-గుంతకల్(కడపమీదుగా)మార్గంలో..

తిరుపతి-గుంతకల్(కడపమీదుగా)మార్గంలో తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే (07657/07658) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేశారు. తక్కువ ధరతో గమ్య చేరడానికి పేదవర్గాలకు ఈరైలు అనుకూలంగా ఉంది. తిరుపతి నుంచి బయలుదేరుతుంది. ప్రతి గ్రామీణస్టేషన్‌లో ఆగుతుంది. దీనిని రద్దు చేయడంతో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు, వ్యాపారులు, రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గుంతకల్-తిరుపతి(ధర్మవరంలైన్)మార్గంలో..

గుంతకల్-తిరుపతి (ధర్మవరంలైన్) మార్గంలో 07589/07590 నంబరుగల తిరుపతి నుంచి కదిరి దేవరపల్లెకు నడిచే పల్లెరైలును కూడా రద్దు చేశారు. ఈ రైలు అనంతపురం, బెంగళూరుతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉండేది. డివిజన్ కేంద్రం గుంతకల్‌కు పుణ్యక్షేత్రమైన తిరుపతి నుంచి ప్యాసింజర్ రైలు నడిచేది. ఈ రైలు కూడా ఆ మార్గంలో ఉన్న పీలేరు, మదనపల్లె, కదిరి తదితర ప్రాంతాలకు చెందిన పల్లె వాసులకు అనుకూలంగా ఉండేది. ఇప్పుడు ఆ రైలు రద్దు కావడంతో ఎక్స్‌ప్రెస్‌రైళ్లే దిక్కయ్యాయి

రెండునెలలపాటు ప్రయాణానికి గ్రహణం

కుంభమేళా-2025 కోసం రెండునెలలపాటు తిరుపతి నుంచి కడప మీదుగా, అటు ధర్మవరం మార్గంలో నడిచే ఆరు రైళ్లను రద్దు చేశారు. అన్నమయ్య, వైఎస్సార్, సత్యసాయి, అనంతపురం జిల్లాల మీదుగా ఉండే రైలుమార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లపై ఆధారపడి ప్రయాణించే వేలాదిమంది పేదలకు పల్లెరైళ్లను దూరం చేశారు.

సామాన్యుడు అంటే చిన్నచూపు



పేదోడి రైళ్లను రద్దు చేస్తే అడిగేవారు లేరన్న ధీమాలో కేంద్రప్రభుత్వం ఉంది. ఎక్స్‌ప్రెస్‌రైళ్లలో జనరల్‌బోగీలు వేయడంలో రైల్వే వివక్షను ప్రదర్శిస్తోంది. ప్యాసింజర్‌రైళ్లు రద్దు చేస్తే ప్రత్యామ్నాయంగా రైళ్లను నడపాలి. సామాన్యుడు అంటేనే కేంద్రానికి చిన్నచూపు.

– టీఎల్ వెంకటేశ్, సీపీఐ నేత, పీలేరు

పేదలను ఇబ్బందులు పెట్టారు...



రైల్వే అధికారులు ప్యాసింజర్ రైళ్లను రద్దుచేసి పేదలను ఇబ్బందులు పెట్టారు. తక్కువ ధరతో పల్లెవాసులకు అనుకూలంగా ఉన్న ఇంటర్‌సిటీ రైలును రద్దు చేయడం అన్యాయం. తిరుపతి నుంచి కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ వరకు పేదవర్గాలు తక్కువ వ్యయంతో వెళ్లేవారు. ఉన్న ప్యాసింజర్ రైళ్ల రద్దు చేశారు. ప్రత్యామ్నాయంగా ప్యాసింజర్‌రైలును నడపాలన్న ఆలోచన కేంద్రానికి లేదు. పేదలంటే మోదీ సర్కారుకు చిన్నచూపు.

-పులివేల రమణయ్య, నాగిరెడ్డిపల్లె, నందలూరు

మార్చి 1వరకు పల్లెరైళ్లకు సెలవు



రైల్వేబోర్డు ఆదేశాలతో దక్షిణమధ్య రైల్వే వారు తిరుపతి-కదిరిదేవరపల్లె ప్యాసింజర్ రైలు, గుంతకల్-తిరుపతి ప్యాసింజర్‌రైలు, తిరుపతి-హుబ్లీ మధ్య నడిచే ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ రైలును వచ్చేయేడాది మార్చి01 వరకు రద్దు చేశారు. ఆదివారం నుంచి ఈరైళ్లు రెండు మార్గాల్లో కూడా నడవవు.

ప్రత్యామ్నాయం చూపని రైల్వేబోర్డు



ఏకంగా రెండు రైలుమార్గాల్లో ఆరు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసే గ్రామీణులు ఇబ్బందులను రైల్వే బోర్డు పరిగణనలోకి తీసుకోలేదన్న అపవాదును మూటకట్టుకుంది. రైల్వేబోర్డు కుంభమేళాకు రేక్స్ కేటాయించాలని కోరితే, దక్షిణ మధ్య రైల్వే అధికారులు రాయలసీమలో పేదలకు అందుబాటులో ఉండే రైళ్లను కేటాయించడంపై విమర్శలు వెలువడుతున్నాయి. ఇతర రైల్వేజోన్‌తోపాటు మరికొన్ని డివిజన్లలో రేక్ పొజిషన్ పుష్కలంగా ఉన్నప్పటికి 'సీమ'పల్లెరైళ్లను కేటాయించారు. ఈ ప్రాంతానికి చెందిన కూటమి ఎంపీలు నోరుమెదిపే పరిస్థితిలో లేరని పేద ప్రయాణికులు ఎద్దేవా చేస్తున్నారు.

గాలివీడు ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి



రాయచోటి: గాలివీడు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సంఘటన దురదృష్టకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి శనివారం రాయచోటిలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటిలో ఎన్నడూ హింసను ప్రేరేపించలేదని, భవిష్యత్తులో కూడా ప్రేరేపించమన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరుబాటకు ప్రజల్లో వచ్చిన మంచి స్పందనను డైవర్ట్ చేయడానికి కుట్రలు పన్నుతున్నారన్నారు. తనకు తెలిసిన సమాచారం మేరకు గాలివీడు ఎంపీడీఓ కార్యాలయ కిందిస్థాయి సిబ్బంది మండల పరిషత్‌కు సంబంధించిన ఫైళ్లలో ఎంపీపీ సంతకాలు చేయాలని, ఆ ఫైల్స్‌ను ఎంపీపీకి చేరవేయాలని ఎంపీపీ కుమారుడు, మాజీ ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డిని కోరారన్నారు. వారి వినతి మేరకు సుదర్శన్ రెడ్డి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లారన్నారు. తన తల్లికి సంబంధించిన రికార్డులు ఎంపీపీ ఛాంబర్‌లో ఉన్నాయని వాటిని తీసుకునేందుకు ఛాంబర్ తాళాలు తీయాలని ఎంపీడీఓ జవహర్ బాబును కోరారన్నారు. ఆ సమయంలో టీడీపీ అనుయాయులు కొంతమంది ముందస్తు వ్యూహంతో రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్నారు. ఇలాంటి సమయాల్లో ప్రజా స్వామ్యంలో అన్ని కోణాలను పరిశీలించాల్సి ఉంటుందన్నారు. సంఘటన జరిగి ఐదు, పది నిమిషాలలోనే టీడీపీకి చెందిన వందలాది మంది అక్కడికి చేరుకోవడం, మనుషులపైన పెప్పర్ స్ప్రే లాంటివి చల్లడం వల్ల అక్కడ భయాందోళనలు నెలకొన్నాయన్నారు. పైస్థాయిలోని అధికార పార్టీ నాయకుల నుంచి ఫోన్లు రావడం, అసభ్యకర పదజాలాలతో దూషించడంపై పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు తెలుస్తాయన్నారు. సుదర్శన్‌రెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఎంపీడీఓ ఆరోగ్యవంతుడిగా, ధైర్యంగా ఉండాలన్నారు. ఈ సంఘటనలో సంబంధం లేని వ్యక్తులను కేసులో ఇరికించరాదన్నారు.

30 నుంచి కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు



మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రకాష్‌బాబు

కడప అర్బన్: దేహదారుఢ్య పరీక్షలు జరిగే జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం మైదానాన్ని శనివారం జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఈనెల 30 నుంచి జనవరి 8 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు పురుష , మహిళా అభ్యర్థులు మొత్తం 4492 మంది హాజరుకానున్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. హై స్పీడ్ ఇంటర్నెట్, అడ్వాన్స్ సిస్టమ్స్, ప్రింటర్స్‌ను సమకూర్చుకుని వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. నియామక ప్రక్రియ యావత్తు సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలుండాలన్నారు. అభ్యర్థులు జిల్లా పోలీస్ కేంద్రంలోనికి అడుగుపెట్టిన దగ్గర్నుంచి ఎవరికి ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్ (పిఎంటి) ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పిఈటి) జరిగే అన్ని ప్రదేశాలను సూచించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలనీ ఆదేశించారు. రిక్రూట్‌మెంట్‌లో పాల్గొనే సిబ్బంది, అధికారులు తెల్లవారుజామున 4 గంటలకే విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) బి. రమణయ్య, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి జ్యోతి, డీటీసీ సీఐ వినయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, జిల్లాలోని పోలీస్ అధికారులు, పలువురు జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, ఐటీ కోర్ టీం సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ అవగాహనతో రాజకీయాలు చేయాలి

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: హడావుడిగా వచ్చి రాజకీయాలు చేస్తే ప్రజలు హర్షించరని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలుసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం అవగాహనతో రాజకీయాలు చేయలని తెలిపారు. రాష్ట్రంలో జరిగే అరాచకాలు కనపడలేదా అని విమర్శించారు.పవన్ కళ్యాణ్ వచ్చి గగ్గోలు పెడితే నిజాలు మారవని తెలిపారు. ఎంపీడీఓను రైతుల సమస్యలపై మొదట ఎంపీపీ అడిగారు. తర్వాత మాటా, మాటా మాటా పెరిగి దుర్భాషలకు దిగారు. విజయవాడలో దళిత ప్రొఫెసర్, లెక్చరర్ విషయంలో ఎందుకు స్పందించలేదని పవన్‌ను ప్రశ్నించారు. ఆడవాళ్లు అదృశ్యమవుతుంటే స్పందించలేదుగాని హెలిక్యాప్టర్లలో తిరుగుతూ చేసే రాజకీయాలు మానుకోవాలని తెలిపారు. పేదలకు మేలు చేయని కూటమి ప్రభుత్వానికి ప్రజలే గట్టిగా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

మట్కా కేసులో టీడీపీ కౌన్సిలర్ మునీర్ అరెస్ట్



ప్రొద్దుటూరు టీడీపీ నాయకులతో కౌన్సిలర్ షేక్ మునీర్ (వృత్తంలో)

ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు మున్సిపల్ కౌన్సిలర్, టీడీపీ నేత షేక్ మునీర్‌ను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతనితో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేసి రూ. 26,370 నగదు స్వాధీనం చేసుకున్నారు. 19వ వార్డు కౌన్సిలర్ షేక్ మునీర్, అతని తమ్ముడు షేక్ బషీర్ అహ్మద్ కొన్ని రోజులుగా మట్కా నిర్వహిస్తున్నారు. ఇటీవల మట్కా జూదానికి సంబంధించిన లావాదేవీల విషయమై మునీర్, మాజీ కౌన్సిలర్ జిలాన్ సోదరుల మధ్య గొడవ జరిగింది. ఈ నెల 23న రాత్రి రూరల్ పరిధిలోని గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్ వద్ద ఇరు వర్గాలవారు ఘర్షణ పడ్డారు. మునీర్ ఫిర్యాదు మేరకు జిలాని, మహమ్మద్‌హుసేన్‌లపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలోనే 25న జిన్నారోడ్డులో మునీర్ అతని వర్గీయులు దాడి చేయడంతో మహ్మద్‌హుసేన్‌కు గాయాలయ్యాయి. అతని ఫిర్యాదుతో 2 టౌన్ పోలీసులు కౌన్సిలర్ మునీర్, అతని తమ్ముడు బషీర్‌పై కేసు నమోదు చేశారు.

పరస్పర దాడులను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు

రెండు వర్గాలు తరచూ దాడులకు పాల్పడటాన్ని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఇరువర్గాలకు చెందిన వారిని బైండోవర్ చేశారు. దాడులకు గల కారణాలను తెలుసుకునేందుకు రెండు రోజుల క్రితం కౌన్సిలర్ మునీర్, తమ్ముడు బషీర్‌తో పాటు మాజీ కౌన్సిలర్ జిలాని, తమ్ముడు మహ్మద్‌హుసేన్‌కు కడపలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా విచారిస్తున్న సమయంలోనే కౌన్సిలర్ మునీర్ సోదరులు మట్కా నిర్వహిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. మట్కా జూదం నిర్వహణపై ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీసులు లోతుగా దర్యాప్తు చేశారు. వీరికి ఎవరెవరు మట్కా పట్టీలు ఇస్తున్నారు, నిర్వహణలో ఎవరి పాత్ర ఉందనే వివరాలను రాబట్టినట్లు సమాచారం. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలువురు మట్కా నిర్వాహకులు వీరికి పట్టీలు ఇస్తున్నట్లు పోలీసుల విచారణలో తెలిసినట్లు సమాచారం.

కౌన్సిలర్‌తో సహా నలుగురు అరెస్ట్

టూ టౌన్ పరిధిలో నిర్వహిస్తున్న మట్కా నిర్వాహకులపై పోలీసులు రెండు రోజులుగా నిఘా పెంచారు. ఈ క్రమంలో జిన్నారోడ్డులోని కెనరా బ్యాంక్ సమీపంలో మట్కా రాస్తున్న దస్తగిరిపేటకు చెందిన 19వ వార్డు కౌన్సిలర్ షేక్ మునీర్ (ప్రస్తుతం గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్‌లో నివాసం), అతని తమ్ముడు బషీర్ అహ్మద్, మోడంపల్లెకు చెందిన పటాన్ జుబేర్‌ఖాన్, దస్తగిరిపేటకు చెందిన దాదాగిరి గౌస్‌బాషాలను శనివారం టూ టౌన్ సీఐ యుగంధర్ సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.26,370 నగదు, నాలుగు మట్కా స్లిప్పులు, మూడు బాల్‌పెన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మరో కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రొద్దుటూరులోని దస్తగిరిపేటలో మట్కా జూదం నిర్వహిస్తున్న పల్లె ప్రశాంత్‌రావు, తలారి మైఖేల్‌బాబులను టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.25,800 నగదు, మట్కా స్లిప్పులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉత్తమ ఫలితాలకు సంకల్ప్ దీక్ష!

- ఇంటర్‌లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక కార్యాచరణ
- రెగ్యులర్ క్లాసులతోపాటు స్టడీ అవర్స్ నిర్వహణ



పులివెందుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మెటీరియల్‌ను అందచేస్తున్న ఆర్ఐవో



స్టడీ అవర్‌లో విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఇంటర్మీడియట్ బోర్డు కసరత్తును ఆరంభించింది. పదో తరగతి మాదిరిగానే ఇంటర్ విద్యార్థులకు 'సంకల్ప్' పేరుతో ప్రత్యేక కార్యాచరణకు బోర్డు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులను ప్రారంభించింది. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు కొనసాగనుంది.


వెనుకబడిన విద్యార్థులపై....

చదువులో వెనుకబడిన విద్యార్థులకు 'సంకల్ప్' కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో ఏ, బి, సి గ్రూపులుగా విభజించి ఇందులో బీ,సీ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అక్టోబర్ 2024లో జరిగిన త్రైమాసిక పరీక్షల్లో కనబరిచిన సామర్థ్యాల ఆధారంగా సి గ్రూపు విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని సారించారు. వీరికి ఇంటర్‌బోర్డు మెటీరియల్‌ను అందించి ప్రోత్సహిస్తుంది. గతంలో జూనియర్ కళాశాలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తుండగా కళాశాలల నిర్వహణ సమయాలను మార్చి ప్రస్తుతం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతలను నిర్వహిస్తూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

విద్యార్థులను దత్తత తీసుకుని...

ప్రతి జూనియర్ కళాశాలలో విద్యార్థులను అధ్యాపకులు దత్తత తీసుకున్నారు. వీరిని పరీక్షల్లో ఉత్తీర్ణులుగా చేయడం వీరి కర్తవ్యం. ఇందుకు సంబంధించిన మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. విద్యార్థులు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రత్యేక స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తారు. ఇలా నిర్వహిస్తున్న సంకల్ప్ కార్యక్రమం అమలు తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు డీవీఈఓ, ఆర్ఐవోలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వారానికి ఒక్క కళాశాలలను సందర్శించి కార్యక్ర మం అమలుపై ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

మంచి మార్కులను సాధిస్తాం...



ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470కి 457 మార్కులను తెచ్చుకున్నాను. అలాగే ద్వితీయ సంవత్సరంలో కూడా మంచి మార్కులు తెచ్చుకుంటాను. మా కళాశాలలో ప్రతి రోజు స్టడీ అవర్స్‌తోపాటు నిత్యం పరీక్షలు నిర్వహించి ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– శ్రీరామ్, ఇంటర్ ఎంపిసి, సెకండియర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల

రెగ్యులర్‌గా స్టడీ అవర్స్...



మా కళాశాలలో పిల్లలందరికి మెటిరియల్‌ను అందచేశాం. దీంతోపాటు రెగ్యులర్‌గా స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నారు. సి గ్రూపు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తున్నాం. ప్రతి ఒక్కరిని ఉత్తీర్ణలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాము.

– త్రివిక్రమ్‌రెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల

మెరుగైన ఫలితాల సాధనకు కృషి



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆ దిశగా కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టాం. ఈ విషయమై నిత్యం అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు తగిన సూచనలు, సలహాలను ఇస్తున్నాం. మేము కూడా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నాం. ఈ ఏడాది అన్ని కళాశాలల్లో మెరుగైన ఫలితాలను సాధిస్తాం.

– బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐఓ, ఇంటర్ విద్య

ఫీజు చెల్లింపు గడువు పెంపు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఇప్పటి వరకు పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించని ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు తత్కాల్ స్కీమ్ ద్వారా ఫీజు చెల్లించవచ్చని ఇంటర్ ఆర్ఐవో బండి వెంకట సుబ్బయ్య తెలిపారు. తత్కాల్ స్కీంలో ఈ నెల 31వ తేదీలోపు రూ. 3 వేలతోపాటు ఎగ్జామినేషన్ ఫీజు చెల్లించి పబ్లిక్ పరీక్షలకు హాజరు కావొచ్చని తెలిపారు. ఈ తత్కాల్ స్కీమ్‌లో ఫీజు చెల్లించిన విద్యార్థులు కడప సెంటర్‌లో మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు.

దయచేసి వినండి.. రైళ్లలో నీళ్లు లేవు!

- మార్గంమధ్యలోనే ఖాళీ అవుతున్న ట్యాంకులు
- పర్యవేక్షణ మరిచిన అధికారులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు

తిరుపతి నుంచి న్యూఢిల్లీకి వెళ్లే సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం బయలుదేరింది. ఇంతలో నీళ్లు అయిపోయాయి. ఏసీ బోగీల్లో తప్ప ఎక్కడా నీటి సరఫరా లేదు. దీంతో టాయిలెట్స్‌కు వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. ఫిర్యాదులు వెళ్లడంతో రైలు నిలిపి కొండాపురం రైల్వేస్టేషన్‌లో నీటిని నింపారు.

ముంబయి నుంచి చెన్నైకి వెళ్లే మెయిల్ ఎక్స్‌ప్రెస్ తెల్లవారుజామున కడప మీదుగా వెళుతున్న క్రమంలో జనరల్‌బోగీలో ఓ ప్రయాణికుడు టాయ్‌లెట్‌కు చేరుకుంటే నీళ్లు రాలేదు. దీంతో అత్యవసర పరిస్థితిలో అతను వాటర్‌బాటిల్‌తో పని కానిచ్చేశారు.

ఇది ఈ రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లకే పరిమితమైన సమస్య కాదు. కొంత కాలంగా చాలా రైళ్లలో ప్రయాణికులు ఇవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాజంపేట : రైళ్లలో నీటి సమస్య ప్రయాణికులను వేధిస్తోంది. రైలు బయలుదేరిన నాలుగైదు గంటల్లోనే.. నీటి కొరత తలెత్తుతోంది. ఏసీ బోగీల్లో తప్ప మిగతా చోట్ల ఎక్కడా కుళాయిల్లో నీళ్లు రావడం లేదు. టాయిలెట్లలో కూడా నీళ్లు రాక ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. టీసీలకు చెబుతున్నా.. ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో రైలు ఆగగానే ప్లాట్‌ఫాం ఉండే కుళాయిల వద్ద ఖాళీ సీసాల్లో నీళ్లు నింపుకోవాల్సి వస్తోంది. అత్యవసరమైన వాళ్లు మినరల్ బాటిల్స్ కొనుక్కోవాల్సి వస్తోంది. రాత్రి పూట తిరిగే రైళ్లలో ఈ సమస్య అధికంగా ఉంది. ఫిర్యాదులు ఎక్కువ రావడం లేదని అధికారులు సన్నాయినొక్కులు నొక్కుతున్నారని ప్రయాణిక వర్గాల నుంచి వినిపిస్తోంది. జిల్లాలో కొండాపురంలో ఒక్క తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలుకు మాత్రమే నీళ్లను పడుతున్నారు. గుంతకల్లు దగ్గరలో ఉంది కాబట్టి.. కొండాపురానికి రైల్వే ప్రాధాన్యత ఇవ్వడం లేదు. రైళ్ల హోల్డింగ్స్ లేవు. మార్గంమధ్యగా ఉన్న నందలూరులోనే అన్ని రైళ్లకు నీళ్లు నింపుకొనేందుకు పుష్కలంగా వనరులు ఉన్నాయని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.


రైలు (ఇన్‌సెట్) వాష్‌బేసిన్‌లో రాని నీరు

నీళ్లు నింపే దగ్గరే సమస్య..

రైలు బయలుదేరే ముందే బోగీల్లో నీళ్లను నింపుతారు. ట్రాక్‌ను ఆనుకొని ఉండే నీటి పైపులైను ద్వారా ప్రతి బోగీలో ట్యాంకులు నింపాలి. వాడకం ఎక్కువై నీళ్లు అయిపోతే మరో పెద్దస్టేషన్‌లో నింపాలి. దీనికి ప్రత్యేకంగా నీళ్లను నింపేందుకు కొన్ని స్టేషన్లను కేటాయిస్తారు. లేదా రైలు బయలుదేరే స్టేషన్, చివరి స్టేషన్‌లో నీటి ట్యాంకును నింపుతారు. మార్గంమధ్యలో ట్యాంకులలో నీళ్లు అయిపోతున్నాయి.

మార్గంమధ్యలో నింపితే..

రైళ్లలో నీటి ట్యాంకులలోని నీళ్లు అయిపోయినా, అయిపోకపోయినా మార్గంమధ్యలో నింపే పద్ధతిని పునరుద్ధరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రయాణికుల నుంచి రైళ్లలో నీటి సమస్యపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రాత్రి బయలుదేరి పగలు గమ్యానికి చేరే రైళ్లకు మధ్యలో నీటిని నింపాల్సిన అవసరం లేదనే అధికారుల అభిప్రాయం.. ఇప్పుడు రైల్వే పరువును గంగలో కలుపుతోందన్న విమర్శలు వస్తున్నాయి. పరోక్షంగా కేంద్ర ప్రభుత్వంపై ఈ ప్రభావం పడుతోంది. గతంలో నీటిని నింపే బాధ్యత రైల్వే అధికారులకే ఉండేది. మూడేళ్ల క్రితం ప్రైవేటు కాంట్రాక్టులకు అప్పగించడంతో ఇప్పుడు రైళ్లలో నీటి సమస్య తారాస్థాయికి చేరుకుంది. దీనిపై రాష్ట్రానికి చెందిన ఎన్‌డీఏ కూటమి ఎంపీలు నోరు విప్పడం లేదన్న విమర్శలున్నాయి.

నందలూరుపై వినతులు

రైళ్లలో నీటిని నింపేందుకు చెన్నై–ముంబయి కారిడార్ రైలు మార్గంలో సెంటర్ పాయింట్‌గా ఉన్న నందలూరు రైల్వే కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని రైల్వే మంత్రిత్వ శాఖకు వినతులు వెళ్లాయి. ఇటీవల ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరీ కూడా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవికి స్వయంగా నందలూరులో అన్ని రైళ్లకు వాటరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, అన్ని రైళ్లకు స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. ఇదే అంశాన్ని ఎంపీలు పీవీ మిథున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డిలు కూడా రైల్వేశాఖ దృష్టికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. దీంతో నందలూరు నీటితో రైల్వేకి పూర్వ వైభవం వస్తుందని ఆశలు నందలూరు ప్రాంతీయుల్లో నెలకొంది.

ఏసీ బోగీలకే ప్రాధాన్యం

ఎక్కువ బోగీలకు నీళ్లు నింపాలంటే ఎక్కువ సంఖ్యలో సిబ్బంది కావాలి. కానీ కాంట్రాక్టర్లు వేతనాల ఖర్చును తప్పించుకునేందుకు తక్కువ మందినే వినియోగిస్తున్నారు. దీంతో వారు ఏసీ బోగీలకు ప్రాధాన్యమిచ్చి మిగతా వాటిని గాలికొదిలేస్తున్నారు. మరి కొన్నింటిలో తక్కువ నీటిని నింపి చేతుల దులుపుకోవడంతో నాలుగైదు గంటల్లోనే ఖాళీ అవుతున్నాయి. కొన్ని రైళ్లలో ట్యాపులు సరిగ్గా లేక, నీరు లీకై మధ్యలోనే ట్యాంకులు ఖాళీ అవుతున్నాయి. కుళాయిలను పర్యవేక్షించాల్సిన సిబ్బంది పట్టించుకోవడం లేదు.

ప్రయాణికులూ.. మేల్కొనండి

కుళాయిల్లో నీళ్లు రాకుంటే ఒకరిద్దరు మినహా ఫిర్యాదు చేసేందుకు పెద్దగా జనం ముందుకు రావడం లేదు. దీంతో ఫిర్యాదులు అంతగా లేనందున ఇది పెద్ద సమస్య కాదని రైల్వే భావిస్తోంది. బోగీల్లో నీళ్లు రాకున్నా, శుభ్రత లేకున్నా ఎస్‌ఎంఎస్ రూపంలో ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందిస్తామని రైల్వే చెబుతోంది.

నందలూరు అనుకూలం



ఇప్పుడు జిల్లా రైలు మార్గంలో నడిచే రైళ్లలో నీటి సమస్యను ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. జనరల్‌బోగీలు, రిజర్వేషన్ బోగీలలో నీళ్లు ఎప్పుడు అయిపోతాయో తెలియదు. ఇటువంటి పరిస్థితిలో చెన్నై–గుంతకల్‌కు సెంటర్ పాయింట్ నందలూరు. ఇక్కడి నీటితో అన్ని రైళ్లకు నింపొచ్చు. తిరుపతి, రేణిగుంటలపై భారం తగ్గుతుంది. ఆ దిశగా రైల్వేశాఖ యోచన చేయాలి. – భూమన శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగిరెడ్డిపల్లె

నీటి సమస్య కొనసాగుతోంది



తిరుపతి నుంచి హుబ్లీకి నడిచే ఇంటర్ సిటీ రైలులో కూడా నీటి సమస్య ఉంది. ఇదే సమస్య అరకోణం, నంద్యాల డెమోలో కూడా ఉంది. వేసవిలో రైళ్లలో నీటి సమస్య మరింతగా ఉత్పన్నమవుతుంది. రైల్వేశాఖ వాటరింగ్ సెంటర్ ఏర్పాటుపై దృష్టి సారించాలి. జిల్లా రైలు మార్గంలో నడిచే రైళ్లకు వాటరింగ్‌కు నందలూరే అనుకూలం. ఈ మార్గంలో నడిచే చాలా రైళ్లలో నీటి సమస్యను ప్రయాణికులు ఎదుర్కొంటున్నారు. – వేపగుంట సాంరాజ్, సంఘ సేవకుడు, నందలూరు

క్లుప్తంగా

ఆటో ఢీకొని ఇద్దరికి గాయాలు


గాయపడ్డ నరసింహులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని అప్పాయపల్లె ప్రధాన రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. 108 సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కమలాపురంలోని తెలుగు వీధికి చెందిన నరసింహులు తన అత్త ఎల్లమ్మతో కలిసి బైక్‌పై కడప నుంచి కమలాపురం పట్టణంలోకి వస్తుండగా అప్పాయపల్లె వద్ద ఆటో ఢీకొంది. ఈ ఘటనలో నరసింహులుకు తీవ్ర, ఎల్లమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వారికి కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించినట్లు 108 వాహన టెక్నీషియన్ జీవరత్నం తెలిపారు.

ఢీకొన్న కారు, టాటా ఏస్ వాహనం


ప్రమాదానికి గురైన వాహనం

చింతకొమ్మదిన్నె : కడప– రాయచోటి జాతీయ రహదారిపై మూలవంక గ్రామం వద్ద శనివారం సాయంత్రం కారు, టాటా ఏస్ వాహనం ఢీకొన్నాయి. కడప వైపు నుంచి జాతీయ రహదారిపై టాటా ఏస్ వాహనం వస్తూ మూలవంక వద్ద చింతకొమ్మదిన్నె వైపు మలుపు తీసుకొనే క్రమంలో.. రాయచోటి వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొంది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో కారులోని వారికి గాయాలు కాలేదు. కారు ముందు భాగం దెబ్బ తింది. సమాచారం అందుకున్న పోలీసులు వాహనాలను చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యకు పుత్ర శోకం


విష్ణు స్వరూప్ (ఫైల్)

కడప కల్చరల్ : శాసనమండలి సభ్యుడు సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణు స్వరూప్ (42) శనివారం హైదరాబాదులో మృతి చెందాడు. గుండెపోటు కారణంగా ఆయనను ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మరణించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రముఖ సినీ హీరో చిరంజీవితోపాటు పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు విచ్చేసి విష్ణు మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. పుత్ర శోకంతో బాధపడుతున్న రామచంద్రయ్యను ఓదార్చారు. ఆదివారం కడప నగర శివారు ప్రాంతమైన చలమారెడ్డిపల్లెలోని తమ స్వస్థలంలో ఖననం చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

రైలు కింద పడి యువకుడి దుర్మరణం

ముద్దనూరు : ముద్దనూరు–చెన్నారెడ్డిపల్లె రహదారిలోని హైవే ఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ సునీల్‌కుమార్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మనోజ్(20) శనివారం మధ్యాహ్నం రైలు కింద పడి మృతి చెందాడు. అతన్ని మండల పరిధిలోని ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన యువకునిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ

సీమ అభివృద్ధికి పరితపించిన లింగమూర్తి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రాయలసీమ అభివృద్ధి కోసం కమ్యూనిస్టు నేత లింగమూర్తి నిరంతరం పరితపించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, మాజీ హోంమంత్రి మైసూరారెడ్డి, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, రాజకీయ విశ్లేషకులు లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. నగర శివారు ప్రాంతమైన విశ్వనాథపురంలోని శ్మశాన వాటికలో లింగమూర్తి స్థూపాన్ని శనివారం ఆవిష్కరించారు. అనంతరం సమీపంలో ఉన్న ఎస్‌ఎల్‌ఎన్ కల్యాణ మండపంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగమూర్తికి 5 శతాబ్దాల నాయకులతో అనుబంధం ఉందని తెలిపారు. మొదటి తరం కమ్యూనిస్టు ఉద్యమ నేతలతో మొదలుకొని, నేటితరం కార్యకర్తలతో కలిసి ఆయన నిత్య యువకుడిలా రాయలసీమ ప్రాంత సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. ముఖ్యంగా రాయలసీమలోని కృష్ణా జలాల నీటిపారుదల కోసం పోరుయాత్ర నిర్వహించారన్నారు. 1975, 1977లలో కడప జిల్లాలో ప్రాజెక్టుల కోసం పర్యటన నిర్వహించారని పేర్కొన్నారు. ఆ సందర్భంలో కడప జిల్లా సమగ్ర సమాచార చరిత్ర, అరుణోదయస్మృతులు అనే రెండు పుస్తకాలు రచించారని, వాటి ద్వారా పూర్తి సమాచారం జిల్లా ప్రజలకు తెలియపరిచారన్నారు. కమ్యూనిస్టు పార్టీలో ఉన్నప్పటికీ ప్రాంతీయ అభిమానంతో ప్రాంతీయ నాయకులను బలపరిచే వారని పేర్కొన్నారు. వారితో కలిసి రాయలసీమ అభివృద్ధి కోసం పని చేసే వారని వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, లెక్కల జోగిరెడ్డి, ఎల్‌ఐసీ నాయకులు రఘునాథరెడ్డి ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజా వెంగళరెడ్డి, డాక్టర్ ఓబుల్ రెడ్డి, వెంకటసుబ్బయ్య, సిద్దిరామయ్య, మక్బూల్ బాషా, వెంకట శివ, తస్లీమ్, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మి, ఆర్‌సీపీ, సీపీఐ, సీపీఎం నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


లింగమూర్తి స్మారక స్థూపం ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బిడ్డకు జన్మనిచ్చి.. తనువు చాలించిన తల్లి

- ఆపరేషన్ తర్వాత మృతి
- కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : పండంటి బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లి తనువు చాలించిన ఘటన శనివారం జమ్మలమడుగు పట్టణంలో చోటు చేసుకోంది. వివరాలలోకి వెళితే.. నంద్యాల జిల్లా మీర్జాపురం గ్రామానికి చెందిన యు.సుమతి (25) భర్త తిరుమలయ్య కూలీ పనులు చేసుకుని జీవించేవారు. సుమతి ఇది వరకే ఒక బాలుడికి జన్మనిచ్చింది. రెండోసారి గర్భం దాల్చింది. నెలలు నిండటంతో శుక్రవారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి సిజేరియన్ చేయాల్సి వస్తుందని సుమతి తల్లిదండ్రులకు సూచించారు. దీంతో వారు ఆసుపత్రిలో చేరారు. శనివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ విజయలక్ష్మి ఆపరేషన్ చేయడానికి థియేటర్‌లోకి తీసుకెళ్లారు. ఆపరేషన్ చేశారు. సుమతి బాలికకు జన్మనిచ్చింది. ఇరువురు క్షేమంగా ఉండటంతో అధికారులు వార్డ్ రూంకు తీసుకొచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బాలింతకు ఫిట్స్ రావడంతో వైద్యులు వైద్యం అందించారు. చివరకు సుమతి చనిపోయింది. దీంతో ఆమె తల్లి కన్నీటి పర్యంతమైంది. తమ బిడ్డకు గతంలో ఎప్పుడూ ఫిట్స్ రాలేదని, ఇప్పుడు వచ్చి చనిపోవడం ఏమిటని బోరున విలపించింది.


సుమతి మృతదేహం

ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ అలుపెరగని పోరాటం చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. శనివారం సీపీఐ శత వార్షికోత్సవాల్లో భాగంగా నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ నుంచి ర్యాలీ నిర్వహించి పాత కలెక్టరేట్ ఎదుట బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని కాన్పూర్‌లో 1925 డిసెంబర్ 25న కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి దేశ అభివృద్ధి కోసం పాటుపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు రామయ్య, ఎల్.నాగసుబ్బారెడ్డి, సుబ్బారెడ్డి, వీరశేఖర్, సుబ్బరాయుడు, చంద్రశేఖర్, సుబ్రమణ్యం, విజయలక్ష్మి, వేణుగోపాల్, కేసీ బాదుల్లా, మద్దిలేటి, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహాసభలు విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : కాకినాడలో జనవరి 5 నుంచి 8వ తేదీ వరకు జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ తెలిపారు. మహాసభల ప్రచార జాత జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరులోని అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణానికి శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వద్ద యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో లక్ష్మీరాజ మాట్లాడుతూ యూటీఎఫ్ 50 ఏళ్లుగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్యను చేరవేయడంలో యూటీఎఫ్ ఎంతో కృషి చేసిందన్నారు. ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు, జిల్లా కార్యదర్శి రవీంద్రుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

తల్లిదండ్రుల మాటలు గౌరవించాలి

రాయచోటి టౌన్ : తల్లిదండ్రుల మాటలను పిల్లలు గౌరవించాలని, పెద్దల సూచనలు పాటించాలని రాయచోటి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆసీఫా సుల్తానా తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు లీగల్ (న్యాయపరమైన) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచి నడవడిక, సత్ప్రవర్తనతో మెలగాలని చెప్పారు. సమాజంలో స్త్రీ ఎప్పుడూ తక్కువ కాదని, అన్ని రంగాల్లో ముందడుగులో ఉందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.నాగేశ్వరావు, టి.నాగరాజ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఆసీఫా సుల్తానా

లారీ ఢీకొని యువకుడి మృతి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మద్దయ్యగారిపల్లి సమీపంలో శనివారం సాయంత్రం లారీ ఢీ కొని ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మండలంలోని సంపతికోటకు చెందిన నారాయణస్వామిరెడ్డి కుమారుడు హరీష్‌రెడ్డి అలియాస్ బాలు (28) ద్విచక్ర వాహనంలో ములకలచెరువు నుంచి వస్తూ మద్దయ్యగారిపల్లి సమీపంలో ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ రవికుమార్ పరిశీలించారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి మహిళ..

బి.కొత్తకోట : పశువులను మేపడానికి వెళ్లిన మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన జరిగింది. సీఐ జీవన్ గంగనాథ్‌బాబు శనివారం వివరాలు వెల్లడించారు. బి.కొత్తకోట మండలంలోని కోటావూరు పంచాయతీ చౌటకుంటపల్లెకు చెందిన చెంచమ్మ(75) శుక్రవారం ఊరి సమీపంలో పశువులను మేపేందుకు వెళ్లింది. అక్కడున్న చెరువులో పశువులకు నీటిని తాపేందుకు తీసుకెళ్లింది. తర్వాత ఏమైందో నీటిలో పడి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. చెంచమ్మ ప్రమాదవశాత్తు నీటిలో పడిందా, లేక పశువులను తాడుతో పట్టుకుని ఉండగా అవి అలాగడంతో నీటిలో పడిపోయి మృతి చెందిందా అని స్థానికులు అనుమానిస్తున్నారు. ఘటనపై మృతురాలి భర్త పెద్ద రెడ్డెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కోనేటిలో పడి..

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపులలో ఓ మహిళ ప్రమాదవశాత్తు కోనేటిలో పడి మృతి చెందింది. గ్రామానికి చెందిన బాపతి కొండారెడ్డి, వెంకటసుబ్బమ్మ(47) దంపతులు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. వెంకటసుబ్బమ్మ రోజూ పశువుల కోసం పొలం వెళ్లి గడ్డి కోసుకువచ్చేది. రోజూ మాదిరిగానే శనివారం ఉదయమే పొలానికి వెళ్లింది. గ్రామ సమీపంలోని సుద్దకుందావ కోనేరు సమీపంతో గడ్డి కోస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు.

గాయపడిన వృద్ధురాలు..

కలికిరి : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి కలికిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కలికిరి పంచాయతీ అండేకురవపల్లి దళితవాడకు చెందిన జంగం వెంకటరమణ భార్య రాణెమ్మ(72) శుక్రవారం సాయంత్రం పాలు తీసుకురావడానికి దుకాణానికి వెళుతుండగా వెనుకవైపు నుంచి వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో రాణెమ్మకు గాయాలు కావడంతో కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి ఆమె మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన ద్విచక్రవాహనదారుపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుమారుడు సురేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రఫీ తెలిపారు.

నాటు బాంబు పేలి కుక్క..

మదనపల్లె సిటీ : నాటు బాంబు పేలి ఓ కుక్క మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలం పాళ్యం కొండలో శనివారం సాయంత్రం జరిగింది. పాళ్యం కొండకు చెందిన శ్రీరాములు మేకలు మేపుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో రోజు మాదిరిగానే మేకల వెంట పెంపుడు కుక్కను తీసుకెళ్లాడు. పోతబోలు చెరువు సమీపంలోని మొరవలో అడవి పందులను చంపడానికి వేటగాళ్లు అమర్చిన బాంబును.. కుక్క కొరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తాలూకా పోలీసులు విచారణ చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

మదనపల్లె సిటీ : మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె పట్టణంలో జరిగింది. గజ్జలకుంటకు చెందిన శ్రీనివాసులు (32) ఓ పాఠశాలలో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో తరచూ గొడవలు పడేవాడు. దీంతో మనస్తాపం చెంది ఓ ప్రైవేటు పాఠశాల గదిలో శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన పాఠశాల సిబ్బంది టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పార్కులో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం

మొక్కలు నాటేందుకు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి రూ.1,12,534 అందజేత

ప్రొద్దుటూరు క్రైం : రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో పచ్చదనం పెంచి దట్టమైన అడవిలా చేయడమే తన లక్ష్యమని డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కులో 500 మొక్కలు నాటేందుకు రూ.1,12,534 చెక్కును శనివారం సాయంత్రం ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ దివాకర్‌కు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి అందజేశారు. ఈ డబ్బుతో మొక్కలను నాటడంతోపాటు సంరక్షించేందుకు డ్రిప్‌ను కొనుగోలు చేయనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గతేడాది కూడా తాను 500 మొక్కలను నాటేందుకు రూ.1,08,500 చెక్కును అటవీశాఖ అధికారులకు అందజేసినట్లు తెలిపారు. గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో తన ప్రయత్నం ఫలించినట్లు పేర్కొన్నారు. అందుకే మరో 500 మొక్కలు నాటేందుకు ఈ మొత్తాన్ని ఇచ్చినట్లు తెలిపారు. రాబోవు 3–4 ఏళ్లలో కూడా అటవీశాఖ అధికారుల సహకారంతో మరిన్ని మొక్కలు నాటి పార్కును దట్టమైన అడవిలా మారుస్తామని చెప్పారు. రాజీవ్‌గాంధీ నేషనల్ పార్కు ఉండటం ప్రొద్దుటూరు ప్రజల అదృష్టమన్నారు. ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ దివాకర్ మాట్లాడుతూ మొక్కలు నాటేందుకు ముందుకు వచ్చిన డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డికి ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఆయన లాగే మరికొందరు ముందుకు వచ్చి పచ్చదనాన్ని పెంపొందించేందుకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌ఓ హేమాంజలి, సీనియర్ అడ్వకేట్ దాదాపీర్, వైద్యులు ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సంజయ్, లక్ష్మీకాంత్‌రెడ్డి, అటవీశాఖ అధికారులు, వనసంరక్షణ సిబ్బంది పాల్గొన్నారు.


ఇన్‌చార్జి డీఎఫ్‌ఓకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి